# భూమి గుండ్రంగానే ఉంది!

—బులుసు వేంకటేశ్వర్లు

"**ఇదిగో** ఈవేళనేనుచెప్పిన పనిజరగవలసిందే!"

ఆఫీసు నుంచి రాగానే శ్రీమతి ఆర్డరు!

"పోనీ భుజ్జిముండని ఉండనిద్దూ!!!"

"లాభం లేదు. మీ కంత భూతదయ ఉంటే హాయిగా దాని కో బోను కట్టించి ఇంట్లో పెట్టి మేపండి. నేను మాత్రం దీని ఆగడాలు ఇంక భరించ లేను. వంటిల్లొదిలి ఇలా వచ్చానో, లేదో కతుకు కతుకు మంటూ లీటరు పాలుతాగేసింది. ఏమైనా సరే, దీన్ని ఎక్కడైనా దింపేసిరండి రాత్రికి."

నేను స్నానానికి సిద్దం కాడవంతో మీనాక్షి ఏదో పని చూసుకుందుకు వంటింటి వైపు వెళ్ళింది.

ఇంతకూ విషయమేమిటంటే—పది పదిహేను రోజులవుతుందనుకుంటా—మా ఇంట్లోకి ఎక్కడి నించో ఒక నల్లపిల్లి ప్రవేశించింది. నిజం చెప్పొద్దూ? వచ్చిన కొత్తలో అది మీనాక్షికి కూడా నచ్చింది. నేను, మీనాక్షి భోజనాలకు కూర్చోగానే అది ఎదురుగా వచ్చి కూర్చునేది. ఇద్దరమూ దానికి చెరో ముద్దా పడేసేవాళ్ళం. ఇలా నాలుగు రోజులు గడిచాయి అక్కడి నించి ఆ పిల్ల మావంటిల్లు గుత్తకు తీసుకుని పాలు, వెన్న, పెరుగు స్వాహా చేయడం మొదలెట్టింది. అంతేకాదు. మరో రెండు రోజుల్లో రాత్రిళ్ళు దీనికోసం ఒక ప్రేమికుడు కూడా మా ఇంటికి రావడం మొదలెట్టాడు! ఇంక రాత్రిళ్ళు ఆ రెండూ కాస్సేపు సరాగం, కాస్సేపు విరాగం! కూతలు, గాండ్రింపులూ, పరుగులూ! మాకు కొంత నిద్ర చెడగొట్టిన మాటకూడా వాస్తవమే!

ఆఫీసులో పని చేసి చేసి అలసిపోయి నేను ఇంటికి రావడం మీనాక్షి పిల్లి మీద పాలుతాగేసిందనో, మజ్జిగ తన్నేసిందనో చెప్పడం ఈ మధ్య నిత్యకృత్యమైపోయింది. రెండు మూడుసార్లు అదిలించి, బెదిరించి చూశాను. ఊహు అది మా ఇల్లు వదలి పెట్టలేదు.

"బాగా చీకటి పడ్డాక జాగ్రత్తగా దాన్ని సంచిలోకి నెట్టి వీధి చివర పార్వతమ్మ గారి ఇంటి ముందు వదిలేసిరండి!!"

"మన వీధిలో ఎందుకు మళ్ళీ? అవతలి వీధిలో వదిలిస్తే!"

"వద్దు లెద్దురూ. అంత దూరం ఎందుకు? మన సుబ్బారావును కొంచెం సాయం చేయ మంటాను. పార్వతమ్మ గారింటి ముందర వది వదలేయండి. అదేపోతుంది."

మీనాక్షి పారతమ్మ గారింటి ముందు అని ఎందుకు అంటూందో తరవాత చెపుతా కానీ, ముందు ఇక్కడ సుబ్బారావును గూర్చి కొంచెం చెప్పాలి.

సుబ్బారావు కాలేజీలో బి.ఎ చదువు కొంటు న్నాడు. మా వాటాకు పక్కగదిలోనే ఉంటున్నాడు. మహా కలుపుగోలు మనిషి. మీనాక్షిని అక్కగారూ అని, నన్ను గురువుగారూ అని పిలుస్తుంటాడు. హెల్పింగ్ నేచర్ గలవాడు.

ఇంతకీ కథలోకి వద్దాం. మా వీధి మహిళా సంఘానికి పార్వతమ్మ గారే పెద్ద(ట) మీనాక్షి అప్పుడప్పుడు చెపుతూ ఉంటుంది. ఆవిడకు చాలా గర్వంట. ఆవిడ ఇంట్లో ఉన్నంత స్టీలు సామాను ఈ వీధిలో ఇంకెవరికి ఇంట్లోనూ లేదని ఒక సారి అందిట. మీనాక్షి కట్టిన 150 రూపాయల ఫారెన్నైలెక్సు చీర తక్కువ ఖరీదు అందంట.

రాత్రిళ్లు మంచం మీదికి చేరాక మీనాక్షి చెప్పడం మొదలు పెడుతుంది. ఏవో ఆడవాళ్ళ గొడవ లెద్దూ అని నేను పట్టించుకోను.

ఈ కొడితే మీనాక్షి ఇంకా చెపుతూనే ఉంటుంది. ఆమె పెదవులకు నా పెదలవులడ్డం పెట్టి మీనాక్షి నింక మాట్లాడనియ్యను. మొత్తం మీద పార్వతమ్మగారంటే మీనాక్షికి పడదు.

"పార్వతమ్మంటే నీ కెందుకు కోపం, మీనాక్షి?"

"అదిగో మొదలు పెట్టారా అపార్థాలు? ఏదో వీధి చివర అనడానికి బదులు మీకు గుర్తుగా చెపుదామని అలా అన్నానంతే!!"






మీనాక్షి తెలివైనది, మాటకారి.

చిన్నగా నవ్వి పీటమీంచి లేచాను.

వెతకబోయిన తీగ కాలుకడ్డు పడ్డట్టుగానే సుబ్బారావు మా ఇంట్లోకే వచ్చాడు—''నమస్కారం గురువుగారూ'' అంటూ ఇదిగో సుబ్బారావు అంటూ మా మీనాక్షి కార్యక్రమం అంతా వివరించింది.

''అల్లాగే, అక్కా! అదెంతపని! మీరు పట్టుకుని నాకివ్వండి. గురువుగారు కూడా రానక్కర్లేదు. సరిగ్గా రాత్రి పది గంటలకు వస్తాను. వస్తాను, గురువుగారూ!!!

పిల్లిని సంచిలోకి పట్టుకోవడం కొంచెం కష్టమే అయింది. నేను, నా శ్రీమతి పిల్లిని మధ్యగా పెట్టుకుని దొంగాటలాడాం జడముడిగా చుట్టుకుని పైటచెంగు గట్టిగా బిగించి బొడ్లో దిరుచెమట పట్టిన మీనాక్షి ముఖం చూస్తే నాకెందుకో చాలా ముద్దనిపించింది. అచ్చం అపర సత్యభామలా అనిపించింది.

సుబ్బారావు వచ్చాడు.

''పట్టేశారా?''

''ఆఁ.''

''ఇలా ఇవ్వండి.''

''ఇదిగో జాగ్రత్త...''

''నేను వదిలేసి వస్తాను, అక్కా!''

''వద్దు. వీరు కూడా వస్తారు. వెనకాల వెళ్ళండి బాగుండదు''

నేనూ బయలుదేరాను. చీకటిరాత్రులు. చలి సుబ్బారావు సంచి పట్టుకుని ముందు నడుస్తున్నాడు. నేను వెనక నడుస్తున్నాను.

ఎవడైనా లేచి ఇదేమిటని అడిగితే ఏం చెప్పాలి? పరువేంకాను? పిల్లి కాదు లోపల. నాకు అనుమానంగా ఉంది. సంచీ విప్పామంటే! అందరూ పోగుపడితే ఛీ బుద్ధుందా, లేదా? పిల్లిని మా ఇంటి ముందు వదిలి వేస్తున్నవా? నేను నీకేం అపకారం చేశాను చెప్పవయ్యా? అంటే ఏం చెప్పేది? సంచిలో పిల్లి ఊపిరాడక చచ్చిందేమో? కూయదేమిటి?

''మ్యావ్!!మ్యావ్!!''

అమ్మయ్యా బతికే ఉంది. పిల్లిని చంపితే వెయ్యి బంగారు గుళ్ళు కట్టించినా పాపం పోదట.

''గురువుగారూ!''

''ఊఁ.''

''ఇక్కడ వదిలేద్దామా?''

''జాగ్రత్త. సంచీ విప్పేయ్'' అన్నాను నెమ్మదిగా

సంచిలోంచి పిల్లి చెంగున దూకి చీకట్లో కలసిపోయింది. నేనూ, సుబ్బారావు నెమ్మదిగా ఇంటికి వచ్చేశాము. సుబ్బారావు గుడ్‌నైట్ చెప్పి తన గదిలోకి వెళ్ళిపోయాడు. నేను ఇంట్లోకి రాగానే తలుపుమూస్తూ ఉంటే వదిలేశారా? ఎక్కడ?'' అంది ఆత్రంగా మీనాక్షి.

''సరిగ్గా పార్వతమ్మ గారి ఇంటిముందే!''

''చాల్లెండి వేళాకోళం!!!

మంచం కేసి నడుస్తూ మీనాక్షి కెవ్వుమంది.

అదిరిపోయి నేను చూశాను.

శ్రీకారంలా కుర్చుని మంచం మీద నుంచి మమ్మల్ని ఇద్దర్నీ మార్చి మార్చి చూస్తుంది ఆ నల్లపిల్లి!! ★